క్లుప్తంగా

అయ్యప్పకు ప్రత్యేక పూజలు


అయ్యప్పస్వామి

జంగారెడ్డిగూడెం: మండలంలోని గుర్వాయిగూడెం శ్రీహరిహరసుత అయ్యప్ప స్వామి ఆలయంలో బుధవారం సందర్భంగా దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామి వారికి పంచామృతాభిషేకాలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. కార్యక్రమాలను అయ్యప్ప చారిటబుల్ ట్రస్ట్ పర్యవేక్షించింది.

శ్రీవారి నిత్యాన్నదానానికి విరాళం


దాత రవికుమార్‌కు విరాళం బాండ్‌ను అందిస్తున్న ఆలయ సూపరింటెండెంట్

ద్వారకాతిరుమల: శ్రీవారి నిత్యాన్నదాన పథకానికి ఓ భక్తుడు బుధవారం రూ.1,00,001 విరాళంగా అందజేశారు. హైదరాబాద్‌కు చెందిన కె.రవికుమార్ ముందుగా కుటుంబ సభ్యులతో కలిసి స్వామి, అమ్మవార్లను దర్శించారు. అనంతరం ఈ విరాళాన్ని ఆలయ కార్యాలయంలో జమ చేశారు. ఈ సందర్భంగా దాతకు ఆలయ సూపరింటెండెంట్ హయగ్రీవాచార్యులు విరాళం బాండ్‌ను అందించారు.

ఘనంగా ముత్యాలమ్మ ఆలయ వార్షికోత్సవం


ముత్యాలమ్మను దర్శించుకుంటున్న భక్తులు


జంగారెడ్డిగూడెం: నూకాలమ్మ ఆలయంలో నిర్వహిస్తున్న పంచమ వార్షికోత్సవం రెండో రోజూ ఘనంగా నిర్వహించారు. ఆలయ నిర్మాణకర్త బవిరిశెట్టి మురళీకృష్ణ, పద్మకుమారి దంపతులతో కూడిన ఆలయ కమిటీ నేతృత్వంలో అర్చకులు అమ్మవారికి, అనంతేశ్వరస్వామి వారికి మహన్యాస పూర్వక ఏకవార రుద్రాభిషేకం, రజత బిల్వార్చన, నీరాజన, మంత్రపుష్పం తదితర పూజా కార్యక్రమాలు అర్చకులు నిర్వహించారు. కార్యక్రమంలో శంకరానందస్వామి ప్రవచనం చేశారు. కాగా, మూడో రోజు కార్యక్రమాల్లో ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు మురళీకృష్ణ తెలిపారు.

నేడు నూకాలమ్మకు కుంభాభిషేకం


నూకాలమ్మ ఆలయంలో గోపూజ చేస్తున్న భక్తులు

జంగారెడ్డిగూడెం: నూకాలమ్మ అమ్మవారి వార్షిక జాతర వేడుకలు రెండో రోజు కొనసాగాయి. ఆలయ కమిటీ చైర్మన్ రాజాన సత్యనారాయణ, వెంకట రామలక్ష్మి దంపతుల ఆధ్వర్యంలో బుధవారం 108 మంది మహిళలతో శ్రీచక్ర నవావరణార్చన నిర్వహించారు. ఆలయ ప్రధానార్చకులు మనోజ్ శర్మ శాస్త్రోక్తంగా పూజలు చేశారు. గోపూజ నిర్వహించారు. సాయంత్రం ఆలయ మాడ వీధుల్లో గారమోత్సవం నిర్వహించారు. కండ్రికగూడేనికి చెందిన శ్రీషిర్డీ సాయి భజన మండలిచే భజన కార్యక్రమం నిర్వహించారు. రాజాన సత్యనారాయణ మాట్లాడుతూ జాతర వేడుకలు మూడో రోజు గురువారం విశేష ద్రవ్యాలు, పంచామృత, సప్తనదీ జలాలతో అమ్మవారికి అభిషేకం, స్వర్ణవర్ణపూర్ణ కవచాలంకరణ నిర్వహిస్తామని తెలిపారు.

జాబ్ మేళాలో 13 మంది ఎంపిక


జాబ్ మేళాలో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ కుసుమ

బుట్టాయగూడెం: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బుధవారం ఏపీ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ సీడాప్, జిల్లా ఉపాధి కార్యాలయం సంయుక్త ఆధ్వర్యంలో జాబ్ మేళా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సుమారు 24 మంది యువతీ యువకులు పాల్గొన్నారు. వీరిలో 13 మందిని పలు ఉద్యోగాలకు ఎంపిక చేసినట్లు కళాశాల ప్రిన్సిపాల్ జి.కుసుమ తెలిపారు. ఈ జాబ్ మేళాలో గ్రీన్‌టెక్ ఇండస్ట్రీస్ ప్రైవేట్ లిమిటెడ్, ఎన్ఎస్ ఇన్‌స్ట్రుమెంట్స్ కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నట్లు చెప్పారు. కార్యక్రమంలో జిల్లా ప్లేస్‌మెంట్ అధికారి, కో–ఆర్డినేటర్ నాగదుర్గ, తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి సేద్యంతో ఆదాయం మెండు

- మొగ్గు చూపుతున్న రైతులు
- క్రమంగా పెరుగుతున్న ఆదరణ
- పెరుగుతున్న భూసారం..చీడ పీడలకు చెక్



కామవరపుకోట: రైతులకు సూచనలు ఇస్తున్న డివిజనల్ వ్యవసాయ శాఖ అధికారి నాగకుమార్


కొయ్యలగూడెం: ప్రకృతి ఎరువుల తయారీపై అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు

కామవరపుకోట: ప్రకృతి వ్యవసాయం ద్వారా రైతులకు అధిక ఆదాయం లభిస్తుందని చింతలపూడి డివిజనల్ వ్యవసాయ అధికారి బి.నాగకుమార్ అన్నారు. మండలంలో బుధవారం ఉప్పలపాడు గ్రామంలో ఖరీఫ్ 2025 సీజన్ కోసం మండల స్థాయి వార్షిక కార్యాచరణ ప్రణాళికపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏడీఏ బి.నాగకుమార్ మాట్లాడుతూ పీఎండీఎస్ 30 రకాల విత్తనాల ప్రాముఖ్యతను వివరించడంతో పాటు, భూమి సారాన్ని మెరుగుపరచడం, ఆదాయాన్ని ఎలా పెంచాలో రైతులకు వివరించారు. అనంతరం డీపీఎం బి.వెంకటేష్ మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయం ద్వారా రసాయన ఎరువుల వాడకం తగ్గుతుందన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారులు, సి.పవన్‌కుమార్, సుమలత, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రకృతి ఎరువుల తయారీపై విద్యార్థులకు శిక్షణ

కొయ్యలగూడెం: ప్రకృతి ఎరువుల తయారీ విధానంపై విద్యార్థులకు తగిన అవగాహన కలిగిందని ప్రకృతి ఎరువుల తయారీ రిసోర్స్ పర్సన్ సుంకర సత్యరాజు పేర్కొన్నారు. బయ్యన్నగూడెం సమీపంలోని కృష్ణ గోశాల ప్రకృతి ఉత్పత్తుల శిక్షణ కేంద్రం వద్ద ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు విడతల వారీగా నిర్వహించిన శిక్షణ తరగతులు బుధవారంతో ముగిసాయి అన్నారు. 60 మంది విద్యార్థిని, విద్యార్థులకు ప్రకృతి ఎరువుల తయారీపై రిసోర్స్ పర్సన్ సుంకర సత్యరాజు అవగాహన కల్పించారు. ప్రకృతి వ్యవసాయ సేద్యం చేయడానికి ప్రకృతి ఆధారిత ఎరువులు దోహదపడతాయి అని తద్వారా పర్యావరణాన్ని కాపాడిన వారమవుతాం అన్నారు. పైగా ఆరోగ్యానికి ప్రకృతి ఆధారిత పంటలు మేలు చేస్తాయని తెలిపారు. హైస్కూల్, ఇంటర్మీడియట్ విద్యార్థులకు ప్రకృతి వ్యవసాయంపై శిక్షణను ఇచ్చారు. కషాయాలు ద్రావణాలు, ఏటీఎం మోడల్‌పై అవగాహన కల్పించారు. స్థానిక రైతులతో విద్యార్థులు ముఖాముఖి సమావేశాలు నిర్వహించి ప్రకృతి వ్యవసాయం అవలంబిస్తున్న రైతులకు కలుగుతున్న ప్రయోజనాలను అడిగి తెలుసుకున్నారు.

సేవా కార్యక్రమాలు అభినందనీయం


వాల్మీకి విజ్ఞాన కేంద్రానికి వాటర్ ట్యాంక్‌ను అందజేస్తున్న ట్రస్ట్ ప్రతినిధులు

జంగారెడ్డిగూడెం: వెంకట సీతామహాలక్ష్మి మెమోరియల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు విశ్వహిందూ పరిషత్ ప్రముఖ్ కూచిభట్ల వెంకట రామ సత్యనారాయణ సేవలు అభినందనీయమని పలువురు వక్తలు అన్నారు. జీలుగుమిల్లి మండలం వంకావారిగూడెం వాల్మీకి విజ్ఞాన కేంద్రానికి వాటర్ ట్యాంక్, విద్యార్థులకు అవసరమైన క్రీడా సామగ్రి, పాఠశాల సిబ్బంది నూతన వస్త్రాలు అందజేశారు. అలాగే విద్యార్థులకు బుధవారం భోజన వసతి కల్పించారు. ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ గత ఐదు సంవత్సరాలుగా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నానన్నారు. మిత్రుడు వెలగల శివాజీ సహకారంతో బుధవారం సేవా కార్యక్రమం నిర్వహించానని తెలిపారు. భవిష్యత్తులో విద్యార్థులకు అవసరమైన రీతిలో సహాయ సహకారాలు అందజేస్తానని తెలిపారు. పాఠశాల వ్యవస్థాపకులు నరసింహారావు, వీహెచ్‌పీ నాయకులు కె.దుర్గాప్రసాద్, నారాయణమూర్తి, బ్రాహ్మణ సంఘ ప్రతినిధులు సాయిబాబా, రవికుమార్, భాను ప్రకాష్, పద్మ, తులసి, నాగలక్ష్మి, రమాదేవి, సత్యవతి, పద్మావతి, తదితరులు పాల్గొన్నారు.

గిరిజనులకు న్యాయం చేయాలి


కేఆర్‌పురం ఐటీడీఏలో వినతిపత్రం అందజేస్తున్న కేవీపీఎస్ నాయకులు

బుట్టాయగూడెం: కేఆర్‌పురం ఐటీడీఏ ఎస్‌డీసీ కార్యాలయంలో తప్పుడు జడ్జిమెంట్లు ఇస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని జెగ్గిశెట్టిగూడేనికి చెందిన గిరిజనుడు వినతిపత్రం సమర్పించాడు. ఈ వినతి పత్రాన్ని గిరిజనుడు ఉడుముల సూర్యచంద్రరావు, కేవీపీఎస్ నాయకులు అందుగుల ఫ్రాన్సిస్‌ల ఆధ్వర్యంలో ఇన్‌చార్జి డీటీకి బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ పూర్వీకుల నుంచి సాగు చేసుకుంటున్న భూమికి గణపవరానికి చెందిన ఒక గిరిజనేతరుడి పేరుమీద జడ్జిమెంట్ ఇచ్చారని దీనిపై విచారణ చేసి తగు చర్యలు తీసుకోవాలని కోరారు. తమకు న్యాయం చేయాలని గిరిజనుడు ఉడుముల సూర్యచంద్రరావు కోరారు.

నూతన కౌలు రైతుల చట్టం తీసుకురావాలి


రైతుసేవా కేంద్రంలో వినతిపత్రం అందజేస్తున్న సంఘ నాయకులు

చింతలపూడి: నూతన కౌలు రైతుల చట్టం తీసుకురావాలని కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి దంతా కృష్ణ డిమాండ్ చేశారు. కౌలు రైతులు నూతన చట్టం కోసం రాష్ట్ర వ్యాప్త పిలుపులో భాగంగా బుధవారం మండలంలోని మల్లాయగూడెం, రేచర్ల రైతు సేవా కేంద్రాల్లో కౌలు రైతు సంఘం ఆధ్వర్యంలో అగ్రికల్చర్ అసిస్టెంట్లకు వినతి పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం వచ్చి 9 మాసాలు కావస్తున్న కౌలు రైతుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూందని విమర్శించారు. కార్యక్రమంలో తేలే నాగు, బి.సత్యనారాయణ, సీహెచ్ కృష్ణ, తక్కెలపాటి ప్రసాదరావు ,చీకటి సత్యనారాయణ, నల్లి రామచంద్రరావు, చీకటి సూరయ్య, తదితరులు పాల్గొన్నారు.

చెరువులో జంతు కళేబరాలు


సత్తెన్నగూడెంలోని చెరువులో ఉన్న జంతు కళేబరం

ద్వారకాతిరుమల: మండలంలోని సత్తెన్నగూడెం గ్రామంలోని చెరువులో వరాహాల మృత కళేబరాలు దర్శనమిస్తున్నాయి. కొందరు వ్యక్తులు మృతి చెందిన వరాహాలను తీసుకొచ్చి ఈ చెరువులో పడేస్తున్నారు. దీంతో అవి కుళ్లిపోయి తీవ్ర దుర్గంధాన్ని వెదజల్లుతున్నాయి. దీంతో అటుగా వెళుతున్న ప్రయాణికులు, గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. అయినా పంచాయితీ అధికారులు కనీసం పట్టించుకోవడం లేదని స్థానికులు ధ్వజమెత్తుతున్నారు. ఇదే పరిస్థితి కొనసాగితే తాము రోగాల బారిన పడతామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

భూ వివాదాలను పరిష్కరించాలని ధర్నా



కేఆర్‌పురం ఐటీడీఏ వద్ద ధర్నా చేస్తున్న సీపీఎం నాయకులు

బుట్టాయగూడెం: ఏజెన్సీ ప్రాంతంలో నెలకొన్న భూ వివాదాలను పరిష్కరించే దిశగా అధికారులు కృషి చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి కోరారు. సీపీఎం ఆధ్వర్యంలో చేపట్టిన ప్రజా చైతన్య యాత్ర ముగింపు సందర్భంగా ఆ పార్టీ ఆధ్వర్యంలో కేఆర్‌పురం ఐటీడీఏ వద్ద బుధవారం ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆదివాసీ గిరిజనులకు చెందాల్సిన వేల ఎకరాల ప్రభుత్వ భూములు అన్యాక్రాంతమయ్యిందన్నారు. ఏజెన్సీలో చట్టాలకు అనుగుణంగా గిరిజనులకు భూములపై హక్కులు కల్పించాలని డిమాండ్ చేశారు. అలాగే పోడు భూములు సాగు చేసుకుంటున్న గిరిజనులకు అటవీ హక్కుల చట్టం ప్రకారం పట్టాలలు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో మొడియం నాగమణి, తెల్లం రామకృష్ణ, కారం భాస్కర్, తెల్లం దుర్గారావు, అందుగుల ఫ్రాన్సిస్, తదితరులు పాల్గొన్నారు.

దుర్గంధంలో కన్నాపురం పంచాయతీ


పారిశుధ్య లోపంతో ఉన్న డ్రెయిన్

కొయ్యలగూడెం: తమ పంచాయతీలో డ్రెయినేజీ వ్యవస్థ అధ్వానంగా ఉందని గ్రామంలో ఏ వీధి చూసినా దుర్గంధంతో నిండిపోయిందని కన్నాపురం గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇళ్ల మధ్య పూడుకుపోయిన బురద నీటి వలన అనారోగ్యాలకు గురవుతున్నామన్నారు. పంచాయతీ పూడిక తీత చేపట్టకపోవడం వలన అనారోగ్యాల బారిన పడుతున్నామని, పిల్లలు వాంతులు విరోచనాలతో హాస్పిటల్స్ వెంట తిరగాల్సి వస్తుందన్నారు. బుట్టాయిగూడెం రోడ్డులోని డ్రెయినేజీ పరిస్థితి వర్షం పడితే వాటర్ ఫ్లోటింగ్ లేక చాలా ఇబ్బంది పడుతున్నామని దేవేంద్ర ఎల్లమ్మ వాపోయింది. అదే విధంగా సీసీ రోడ్లపై చెత్త పేరుకుపోయిందని, పారిశుధ్యం అమలు చేయడం లేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ఈ నేపథ్యంలో తక్షణమే పంచాయతీ ప్రజా ప్రతినిధులు, అధికారులు స్పందించి పారిశుధ్య పనులను అమలు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

విద్యార్థులకు ప్రోత్సాహక చెక్కుల అందజేత



విద్యార్థినికి నగదు చెక్కును అందజేస్తున్న గోద్రెజ్ సంస్థ జనరల్ మేనేజర్ మహంతి

ద్వారకాతిరుమల: చదువులో రాణించే విద్యార్థులను ప్రోత్సహించేందుకు సీహెచ్ పోతేపల్లిలోని గోద్రెజ్ ఆగ్రోవేట్ లిమిటెడ్ ఆయిల్‌పామ్ సంస్థ కృషి చేస్తుందని ఆ సంస్థ జనరల్ మేనేజర్ ఎస్.మహంతి తెలిపారు. గత విద్యా సంవత్సరంలో పదో తరగతి పరీక్షా ఫలితాల్లో ప్రతిభ కనబరచి, అత్యధిక మార్కులు పొందిన 52 మంది ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ.5 వేలు చొప్పున, మొత్తం రూ.2.60 లక్షలను ప్రోత్సాహక బహుమతులుగా స్థానిక సమాధానం సెంటర్‌లో మంగళవారం ఆయన అందజేశారు. ఈ సందర్భంగా మహంతి మాట్లాడుతూ సంస్థకు చెందిన వన్‌స్టాప్ సొల్యూషన్ సెంటర్ల పరిధి అయిన ద్వారకాతిరుమల మండలంలోని సీహెచ్ పోతేపల్లి, పావులూరివారిగూడెం, అలాగే ఉంగుటూరు మండలంలోని గొల్లగూడెం, కామవరపుకోట మండలంలోని ఆడమిల్లి, చింతలపూడి మండలంలోని సీతానగరం, అదేవిధంగా ముసునూరు, చాట్రాయి మండలాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులను ఎంపిక చేసి, ఈ బహుమతులను అందించినట్టు చెప్పారు. కార్యక్రమంలో సంస్థ సిబ్బంది, విద్యార్థినీ విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, రైతులు పాల్గొన్నారు.

క్షయపై అవగాహన అవసరం


క్షయపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

భీమడోలు: క్షయ వ్యాధిపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని జిల్లా ఎయిడ్స్, క్షయ నివారణాధికారి ఎం నాగేశ్వరరావు అన్నారు. పూళ్ల పీహెచ్‌సీలో బుధవారం జాతీయ ఎయిడ్స్, టీబీ నియంత్రణ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో సంచార వాహనం వద్ద పలు రకాల నిర్ధారణ పరీక్షలు చేశారు. వ్యాధి విస్తరణ, నిర్ధారణ వంటి అంశాలపై క్షేత్ర సహాయ సిబ్బందికి అవగాహన కల్పించారు. వ్యాధుల లక్షణాలను వివరించారు. వైద్యులు సూచించిన మందులనే వాడాలన్నారు. ఈ మేరకు తొలుత కరపత్రాలు పంచారు. కార్యక్రమంలో వైద్యాధికారిణి పి.అరుణజ్యోతి, సూపర్‌వైజర్లు కిషోర్, శ్రీనివాస్, ప్రాజెక్టు మేనేజర్ కె.శిరీషా, కౌన్సలర్ సురేష్, హనుమంతు, ఫీల్డ్ సిబ్బంది, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

బాల్య వివాహాలను అరికడదాం

భీమడోలు: బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని, ఈ విషయంలో తల్లిదండ్రులను అవగాహన కల్పించాలని పూళ్ల వైద్యాధికారిణి పి.అరుణజ్యోతి అన్నారు. పూళ్ల జెడ్పీ ఉన్నత పాఠశాల, పోలసానిపల్లి సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాలలో బుధవారం చైల్డ్ రైట్స్ అడ్వకసీ ఫౌండేషన్ ఆధ్వ్యంలో బాల్య వివాహ నిరోధక కమిటీ సభ్యులతో సమావేశం నిర్వహించారు. భీమడోలులో క్రాఫ్ జిల్లా కోఆర్డినేటర్ ఆర్.వినోద్‌కుమార్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో డాక్టర్ అరుణజ్యోతి మాట్లాడారు. బాల్య వివాహాల నియంత్రణలో గ్రామస్థాయి నిరోధక కమిటీలు ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. బాల్య వివాహాల వల్ల చిన్న వయస్సులోనే గర్భం దాల్చడం ద్వారా అనేక శరీరక, మానసిక రుగ్మతలకు గురై తీవ్ర అనారోగ్య సమస్యలతో బాధపడతారని చెప్పారు. సూపర్‌వైజర్ షేక్ నూర్జహాన్ మాట్లాడుతూ 18 ఏళ్లలోపు వారికి వివాహాలు చేయడం చట్ట రీత్యా నేరమని, బాల్య వివాహాలు ప్రోత్సహించినా, చేసిన కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. బాల్య వివాహాలు జరిగితే టోల్ ఫ్రీ నెంబర్ 1098కు సమాచారం అందించాలని కోరారు. జిల్లా కోఆర్డినేటర్ వినోద్‌కుమార్ మాట్లాడుతూ బాల్య వివాహాల రహిత జిల్లాగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ పాటు పడాలని కోరారు. టీచర్ ఏడీపీ జ్యోతి మాట్లాడుతూ బాల్య వివాహాల వల్ల భవిష్యత్తులో విద్య, ఆరోగ్యానికి దూరమవుతారని తెలిపారు. కార్యక్రమంలో వివిధశాఖల సిబ్బంది పాల్గొన్నారు.

పాము కాటుతో మహిళ మృతి

ఏలూరు టౌన్: మొక్కజొన్న పొత్తుల విరిచే పనికి వెళ్లిన మహిళ పాము కాటుకు గురైంది. హాస్పిటల్‌కు తరలించేలోపు మృతి చెందింది. లింగపాలెం మండలం వేములపల్లి గ్రామానికి చెందిన ఉప్పులూరి లక్ష్మి (48) భర్త నగేష్, ముగ్గురు పిల్లలు ఉన్నారు. బుధవారం ఉదయం కామవరపుకోట మండలం కళ్లచెరువు సమీపంలో కండ్రికగూడెంలో మొక్కజొన్న పొత్తులను విరిచే పనికి వెళ్లింది. పనిలో ఉండగా పాముకాటు వేయటంతో అపస్మారక స్థితిలోకి వెళ్లింది. ఆమెను వెంటనే సహచర కూలీలు ఏలూరు జీజీహెచ్‌కు తరలించారు. హాస్పిటల్ అత్యవసర వైద్యసేవల విభాగంలో వైద్యులు పరీక్షించి అప్పటికే ఆమె మృతిచెందినట్టు నిర్ధారించారు. వైద్యులు మెడికో లీగల్ కేసుగా నమోదు చేసి హాస్పిటల్ ప్రాంగణంలోని పోలీస్ అవుట్‌పోస్టుకు సమాచారం అందించారు.


డ్వాక్రా ఉత్పత్తుల డెలివరీ వేగవంతం చేయాలి

కొయ్యలగూడెం: సాధారణ మహిళలను సంపన్నులుగా చేయడానికి స్వయం సాధికారత ఉత్పత్తులు ఉపయోగపడతాయని జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ ఆర్.విజయ్‌రాజు పేర్కొన్నారు. కనకాద్రిపురం గ్రామంలో గుడ్ హెల్త్ బ్రాండ్ పేరుతో తయారు చేస్తున్న చిరు ధాన్యాల ఉత్పత్తులను ఆయన పరిశీలించారు. ఓఎన్‌డీసీ ఆన్‌లైన్ ప్లాట్ ఫారంలో డ్వాక్రా మహిళలు చేసిన ఉత్పత్తులు తయారీ విధానం , ప్యాకింగ్ విధానం, ఏ సంస్థల ద్వారా డెలివరీ చేసున్నారో తెలుసు కోవటానికి రెండు గంటల పాటు కేంద్రం వద్ద గడిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ ఆదేశాలతో ప్రతి మండలంలో డ్వాక్రా మహిళలకు వచ్చిన ఆర్డర్లు ఏ విధంగా డెలివరీ చేస్తున్నారో పరిశీలిస్తున్నట్లు తెలిపారు. ఈ మేరకు ఎక్స్‌ప్రెస్‌బీ అనే డెలివరీ సంస్థ ప్రతినిధులు సాయి, ఆరీఫ్‌లతో చర్చించి ఆయన చేతుల మీదుగా ఉత్పత్తులు డెలివరీ చేశారు. జిల్లాలో పదిహేడు మండలాల్లో డ్వాక్రా మహిళలు తయారు చేస్తున్న ఉత్పత్తులు 10903 ఆన్‌లైన్‌లో విక్రయాలు నిర్వహిస్తున్నామన్నారు. వాటిలో ఆగిరిపల్లి, కొయ్యలగూడెం, కైకలూరు, మండవల్లి మండలాలు ముందు వరుసలో ఉన్నాయన్నారు. ఆగిరిపల్లిలో మూడు డ్వాక్రా సంఘాలు చేసిన 2198 ఉత్పత్తులలో 314, కైకలూరులో నాలుగు సంఘాలకు చెందిన 2347 ఉత్పత్తుల్లో 612, మండవల్లి మండలంలో రెండు డ్వాక్రా సంఘాలకు చెందిన 2586 ఉత్పత్తుల్లో 845 డెలివరీ చేశారన్నారు. ఒక గ్రూపుకు చెందిన కనకాద్రిపురం గుడ్ హెల్త్ మిల్లెట్స్ ఫుడ్ నుంచి 1480 గాను 709 డెలివరీ పూర్తయినట్లు వివరించారు. ఈనెలాఖరికి డెలివరీ పూర్తి చేసి గుడ్ హెల్త్ మిల్లెట్స్ ఫుడ్ మొదటి స్థానం సంపాదించుకోవాలని సూచించారు. జిల్లా మహిళా సమాఖ్య కార్యదర్శి వినీల ఎంటర్ ప్రైజెస్ చైర్మన్ తోట కృపామణి ఉత్పత్తుల తయారీ విధానాన్ని ప్రాజెక్టు డైరెక్టర్‌కు వివరించారు. కార్యక్రమంలో వెలుగు సీసీ గంధం కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.


ఆహార ధాన్యాల ఉత్పత్తి కేంద్రాన్ని పరిశీలిస్తున్న విజయ్‌రాజు

దివ్యాంగ లబ్ధిదారుల్లో టెన్షన్

భీమడోలు: పింఛన్ల పునఃపరిశీలన కార్యక్రమం కొనసాగుతోంది. తమ పింఛన్లు ఎక్కడ తొలగిస్తారోనని లబ్ధిదారులతో టెన్షన్ మొదలైంది. రూ.6 వేలు అందుకుంటున్న ఎముకల సంబంధిత దివ్యాంగ లబ్ధిదారుల వైకల్యాన్ని గుర్తించేందుకు ప్రభుత్వం సంబంధిత వైద్యులతో పునఃపరిశీలన కార్యక్రమాన్ని చేపట్టింది. సదరం ధ్రువీకరణ పత్రాలు సరైనవోకావో పరిశీలిస్తున్నారు. భీమడోలు మండల వ్యాప్తంగా 1,180 మంది దివ్యాంగ పింఛన్లు అందుకుంటున్నారు. భీమడోలు, గుండుగొలను, కోడూరుపాడు, దుద్దేపూడి సచివాలయాల పరిధిలోని 123 మంది దివ్యాంగులకు భీమడోలు సామాజిక ఆరోగ్య కేంద్రం వద్ద బుధవారం నిర్వహించే వైద్య పరీక్షలకు హాజరు కావాలని సచివాలయాల ఉద్యోగుల నుంచి సమాచారం పంపారు. దీంతో దూర ప్రాంతాల నుంచి వ్యయప్రయాసాలను ఓర్చి వారిని కుటుంబ సభ్యులు ఆసుపత్రికి తీసుకొచ్చారు. బాధితుల వద్దకే వైద్యులు వస్తే ఇబ్బందులు ఉండవని వారు పేర్కొంటున్నారు. ఎండల వేళ ఉదయం నుంచి సాయంత్రం వరకు పరీక్షల కోసం గంటల కొద్దీ లబ్ధిదారులు పడిగాపులు పడ్డారు. వీరికి మంచి నీటి మినహా ఎటువంటి సదుపాయాలు కల్పించకపోవడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు.


భీమడోలు సీహెచ్‌సీకి వచ్చిన పింఛన్‌దారులు

రేపు మండల పరిషత్ సమావేశం

టి.నరసాపురం: మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఈ నెల 28వ తేదీన నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో జి.మణికుమారి తెలిపారు. ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో మధ్యాహ్నం రెండు గంటలకు ఎంపీపీ ధారబోయిన లక్ష్మి అధ్యక్షతన నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అన్ని శాఖల అధికారులు వారి ప్రగతి నివేదికలతో కార్యక్రమానికి హాజరు కావాలన్నారు. మండలంలోని అభివృద్ధి అంశాలు, చేపట్టాల్సిన కార్యక్రమాలపై సమీక్షిస్తారని, కావున ప్రజాప్రతినిధులు, అధికారులు తప్పనిసరిగా హాజరు కావాలని సూచించారు.

నేడు, రేపు స్వయం ఉపాధి సోపానం ఇంటర్వ్యూలు

చింతలపూడి: మండలంలో స్వయం ఉపాధి సోపానం కింద బీసీ, కాపు కార్పొరేషన్ రుణాల కోసం 951 దరఖాస్తులు వచ్చినట్లు ఎంపీడీఓ మురళీకృష్ణ బుధవారం తెలిపారు. ఈ నెల 27, 28 తేదీల్లో మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించే ఇంటర్వ్యూలకు దరఖాస్తుదారులు హాజరు కావాలని కోరారు. అభ్యర్థులు ఆన్‌లైన్ అప్లికేషన్, కుల, ఆదాయ, బర్త్ సర్టిఫికెట్లు, ఆధార్ కార్డు, బ్యాంక్ పాస్‌బుక్, ఆరు నెలల ఖాతా వివరాలు, పాన్‌కార్డు, రేషన్‌కార్డు, రెండు పాస్‌పోర్ట్ సైజ్ ఫోటోలు తీసుకుని ఇంటర్వ్యూలకు హాజరు కావాలని తెలిపారు. 27 వ తేదీన చింతంపల్లి, సీతానగరం, ఊట సముద్రం, యండపల్లి, గణిజర్ల, లింగగూడెం, మల్లాయగూడెం, పోతునూరు, రాఘవాపురం గ్రామాలకు చెందిన అభ్యర్థులు హాజరు కావాలని అన్నారు. 28వ తేదీన యర్రగుంటపల్లి, యర్రంపల్లి, ప్రగడవరం, తిమ్మిరెడ్డిపల్లి, ఉర్లగూడెం, వెంకటాద్రిగూడెం, వెంకటాపురం, నామవరం, రేచర్ల గ్రామాల అభ్యర్థులు ఇంటర్వ్యూలకు హాజరు కావాలని విజ్ఞప్తి చేశారు.

పోలవరం పనుల పరిశీలన

పోలవరం రూరల్: పోలవరం ప్రాజెక్టు నిర్మాణం పనులను ఎప్పటికప్పుడు అంతర్జాతీయ నిపుణుల కమిటీ సభ్యులు పరిశీలిస్తున్నట్లు మంత్రి నిమ్మల రామానాయుడు పేర్కొన్నారు. ఆయన గురువారం పోలవరంలో పర్యటించనున్న దృష్ట్యా ఏర్పాట్లను మంత్రి అధికారులతో కలిసి పరిశీలించారు.

విరాళాల సేకరణ


కన్నాపురంలో విరాళాలు సేకరిస్తున్న గిరిజన మహిళలు

కొయ్యలగూడెం: శ్రీసీతారామ లక్ష్మణ సమేత హనుమద్ నూతన ఆలయ నిర్మాణానికి గిరిజన మహిళలు బుధవారం విరాళాలను సేకరించారు. కన్నాపురంలోని సంత దుకాణాల వద్ద బుట్టాయగూడెం మండలం రెడ్డికోపెల్ల గ్రామానికి చెందిన గిరిజన మహిళలు ఈ ఆధ్యాత్మిక కార్యక్రమ నిర్వహణకు పూనుకున్నారు. ఈ నేపథ్యంలో తమ గ్రామంలో నూతనంగా ఆలయ నిర్మాణానికి మహిళలమే సంకల్పించామని అందుకు దాతల నుంచి విరాళాలు సేకరిస్తూ గ్రామాలలో పర్యటిస్తున్నట్లు వారు తెలిపారు.

ఉపాధి కూలీల వేతనాలు చెల్లించాలి


కూలీలతో మాట్లాడుతున్న సీపీఎం నాయకులు

ద్వారకాతిరుమల: ఉపాధి హామీ కూలీల మూడు నెలల వేతన బకాయిలను వెంటనే చెల్లించాలని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు ఆర్.లింగరాజు డిమాండ్ చేశారు. మండలంలోని పంగిడిగూడెంలో సీపీఎం నేతల బృందం ఉపాధి పనులు నిర్వహిస్తున్న పొలాల్లోకి వెళ్లి, కూలీలతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా లింగరాజు మాట్లాడుతూ ఉపాధి హామీ చట్టాన్ని కేంద్రంలోని మోదీ ప్రభుత్వం నిర్వీర్యం చేస్తుందని విమర్శించారు. కార్యక్రమంలో సీపీఎం పార్టీ మండల ఆర్గనైజర్ కట్టా భాస్కరరావు, పార్టీ గ్రామ నాయకులు మానుకొండ వీర్రాజు తదితరులున్నారు.